క్లుప్తంగా

'క్యాంపెయిన్ 2025' ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సోమవారం 'క్యాంపెయిన్ 2025' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ ప్రచారం రానున్న రెండు నెలల పాటు జిల్లా వ్యాప్తంగా యువతపై దృష్టి సారించి హెచ్‌ఐవీ, ఎయిడ్స్, లైంగికంగా సంక్రమించే వ్యాధులు, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కల్పించనుంది. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఎనిమిది వారాల్లో 200 గ్రామ స్థాయి సమావేశాలు, 20 సైకిల్ ర్యాలీలు, 700 గృహ సందర్శనలు, 20 జానపద ప్రదర్శనలు, మురికివాడల్లో 30 కార్యక్రమాలు, 40 ఫ్లాష్ మాబ్‌లు, 400 పాఠశాలలు, 86 కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవాని శంకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు, ఎయిడ్స్ నియంత్రణ విభాగం సూపర్‌వైజర్లు బబ్లి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు తక్షణ పరిష్కారం



అర్జీ స్వీకరిస్తున్న జోన్–4 కమిషనర్ మల్లయ్యనాయుడు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు స్వీకరించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్‌కు 1, రెవెన్యూ విభాగానికి 2 చొప్పున మొత్తం 3 అర్జీలు అందినట్లు తెలిపారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి, పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు, యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు, తాగునీటి విభాగం అధికారులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట వద్ద పూజలు చేస్తున్న బొట్టెట ప్రసాద్

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై వినాయక చవితి ఉత్సవాలకు డీజే బాయ్స్ శ్రీకారం చుట్టారు. సోమవారం పందిరి రాట వేసి పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొట్టెట ప్రసాద్ రాట వద్ద పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మహిళా కళాశాల విద్యార్థినికి ప్రథమ బహుమతి



బహుమతి అందుకుంటున్న తులసి

దాబాగార్డెన్స్: ఆర్‌టీఐ యాక్ట్ – 2025పై నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్.తులసి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. ఈ మేరకు సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, పలువురు అధ్యాపకులు అభినందించారు. ఈ పోటీలు విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో నిర్వహించగా, స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఆర్.శామ్యూల్ చేతుల మీదుగా తులసి బహుమతి అందుకుందని తెలిపారు.

భయం భయం

- కంచరవీధిలో మందుబాబులు, గంజాయి బ్యాచ్‌ల హల్‌చల్
- దొంగల స్వైరవిహారంతో భయాందోళనలు
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న స్థానికులు
- పట్టించుకోని పోలీసులు



మందుబాబులు, గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా మారిన మరిడిమాంబ ఆలయ ప్రాంతం



మరిడిమాంబ ఆలయం వద్ద కొత్త హుండీ ఏర్పాటు చేస్తున్న కమిటీ సభ్యులు

దాబాగార్డెన్స్: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే కంచరవీధి సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. ఓ వైపు మందుబాబుల చిందులు... మరోవైపు గంజాయి బ్యాచ్ హల్‌చల్... ఇంకో వైపు దొంగతనాలతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మొత్తంగా కంచరవీధి సమస్యల సుడిగుండంలో చిక్కుకుందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. స్థానిక కార్పొరేటర్ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తుండగా పోలీసుల చర్యలు అంతంత మాత్రమేనని స్థానికులు వాపోతున్నారు. సాయంత్రం పొద్దుపోయే సరికి గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తున్నా పోలీసులు వచ్చి స్థానికులతో మాట్లాడి వెళ్లిపోతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదంటూ పలువురు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ 38వ వార్డు కంచరవీధి మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ ప్రాంతంలో ఇటు హిందూ ముస్లింలు సోదరభావంతో మెలుగుతున్నారు. ఎవరికి కష్టమొచ్చినా మేమున్నామంటూ ఒకరికొకరు సహాయం చేసుకుంటూ పలు ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న మరిడిమాంబ ఆలయానికి ఓ ముస్లిం పెద్దాయన గౌరవ అధ్యక్షుడిగా గత 25 ఏళ్లుగా ఉన్నారంటే ఇక్కడి స్నేహ సంబంధాలను అర్థం చేసుకోవచ్చు. ఓ వైపు యాసీన్‌బాబా దర్గా.. మరో వైపు మరిడిమాంబ ఆలయం.. పాత నగరంలో ఇంతటి ప్రాధాన్యత గల ప్రాంతాన్ని పాలకులు విస్మరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

విచ్చలవిడిగా అసాంఘిక కార్యక్రమాలు

కంచరవీధిలోని మరిడిమాంబ ఆలయ హుండీని గతంలో రెండు మూడు సార్లు దొంగిలించారు. వారం రోజుల కిందట దొంగలు మరలా హుండీని ఎత్తుకెళ్లారు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేగాక సాయంత్రం పొద్దుపోయే సరికి విచ్చలవిడిగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రాత్రి 11 గంటల తర్వాత గంజాయి సేవించడం.. అటుగా వెళ్లే వారిపై దాడులకు దిగుతున్నారని పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన అంతంత మాత్రమే ఉంటుందని పలువురు వాపోతున్నారు. నగర పోలీస్ కమిషనర్ అసాస్తులున్నా ఈ ప్రాంతంలో పర్యటించి గంజాయి బ్యాచ్.. మందుబాబుల ఆగడాలు అరికట్టేలా చర్యలు చేపట్టాలని కంచరవీధి ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రత్యక్ష నరకం చూస్తున్నాం

మరిడిమాంబ ఆలయ హుండీని కొద్ది రోజుల కిందట విరగ్గొట్టి డబ్బులు దోచుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేద్దామంటే పట్టించుకోవడం లేదు. స్వయంగా దొంగతనాలు జరుగుతున్నాయి. యాసీన్ బాబా దర్గా, మరిడిమాంబ ఆలయానికి వచ్చే భక్తులు కూడా రావడానికి భయపడి పోతున్నారు. స్థానికంగా ఉన్న మేము ప్రత్యక్ష నరకం చూస్తున్నాం. ఎవరు ఎప్పుడు దాడికి దిగుతారో తెలియక బిక్కుబిక్కుమంటున్నాం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే పోలీసులు వచ్చి వెళ్లిపోవడం తప్ప సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం లేదు.

– డాక్టర్ రియాజ్ అహ్మద్



మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి?

రెండు మూడు సార్లు మరిడిమాంబ ఆలయ హుండీని దోచుకెళ్లారు. వారం రోజుల కిందట మరోసారి హుండీని దోచుకెళ్లారు. దొంగలు, గంజాయి బ్యాచ్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా గంజాయి బ్యాచ్‌తో సమస్య తీవ్రంగా ఉంది. పోలీసులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలి.

– అర్జునుడు, మరిడిమాంబ ఆలయం

'భారతీయ వైజ్ఞానిక వైభవం' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య నాగేశ్వరరావు

మురళీనగర్: నేటి వైజ్ఞానిక పురోగతికి మూలాలు భారతీయ శాస్త్ర గ్రంథాల్లో ఉన్నాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. ద్వారకానగర్ బీవీకే కళాశాలలో విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో చెరుకూరి సర్వేశ్వరరావు రచించిన భారతీయ వైజ్ఞానిక వైభవం గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రపంచంలోనే మన ఆయుర్వేదం అతి ప్రాచీన వైద్య విజ్ఞానమని పేర్కొన్నారు. మన వైజ్ఞానికుల కృషిని తెలుగులో సరళమైన శైలిలో చెరుకూరి సర్వేశ్వరరావు అందించారన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేస్తూ ధన్వంతరి, చరకుడు, శుశ్రుతుడు, వరాహమిహిరుడు, భాస్కరాచార్యులు, ఆర్యభట్టు వంటి ఆరుగురు శాస్త్రవేత్తల జీవిత విశేషాలు గ్రంథం చేయడం అభినందనీయమన్నారు. వారి గ్రంథాల్లోని పలు రకాల చికిత్స విధానాలు, శరీర నిర్మాణం, మానసిక రుగ్మతలకు సంబంధించిన అనేక విషయాలను చాలా లోతుగా పరిశీలించి గ్రంథాన్ని రూపొందించారని చెప్పారు. గౌరవ అతిథి డాక్టర్ కొచ్చెర్లకోట సత్యనారాయణమూర్తి, ఆచార్య పీఎస్‌ఆర్ అవధాని, ఆచార్య కె.విశ్వనాథ్, శేఖరమంత్రి ప్రభాకరరావు పాల్గొన్నారు.

కూటమి పాలన మోసపూరితం



బంగారుమెట్టలో మహిళలకు కరపత్రం అందిస్తున్న రమేష్ తదితరులు



31వ వార్డులో మహిళలకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న దొడ్డి బాపు ఆనంద్



స్ప్రింగ్ రోడ్డులో ప్రచారం చేస్తున్న కనకరెడ్డి, పార్టీ నాయకులు

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం 33వ వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో బంగారుమెట్ట బూత్ నంబర్ 62 పరిధిలో గడప గడపకు వెళ్లి ప్రజలకు కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరించారు. పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ పద్మ రవిల్లి రాము, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడు సూర్య నాయుడు, వార్డ్ యూత్ ప్రెసిడెంట్ బూర్లు రన్ను, జిల్లా మహిళా నాయకులు కొల్లు సత్యవతి, ధర్మ, పీవీ ఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, మత్స్యకార నాయకుడు బోడపల్లి శివకుమార్, వార్డ్ నాయకులు పాల దామోదర్‌రెడ్డి, తరుణ్‌కుమార్, ఎ.కొండలరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

31వ వార్డులో..

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపు ఆనంద్ నేతృత్వంలో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బీఐ కాలనీ చాకలిగెడ్డ బూత్ నంబర్ 201 పరిధిలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలన గురించి ప్రజలకు తెలియజేశారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండానే మోసం చేశారని, ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలు నెరవేర్చలేదని, ఆశలు పెట్టి అందరినీ ముంచే మోసపూరిత పాలన తొలగించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని... క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేయించారు. పార్టీ నాయకులు పెంటకోట నాగరాజు, రాము మాస్టార్, కాంట్రాక్ట్ నాయుడు, కనుకలు, బాబూరావు, పీలక మోహన్, శ్రీనాథ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

35వ వార్డులో..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 81వ బూత్ పండా వీధి, స్ప్రింగ్ రోడ్డులో కార్యకర్తలతో కలిసి చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి ప్రజలకు వివరించారు. హామీలు నెరవేర్చక పోగా.. సూపర్ సిక్స్ పథకాలను కూడా విస్మరించారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమ పథకాలు పొందాలని కనకరెడ్డి అన్నారు. పార్టీ జిల్లా సెక్రటరీ ఆదినిష్టురెడ్డి, సోషల్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సువార్త రాజు, పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు జీరు సూర్యనారాయణ, సిటీ వాణిజ్య విభాగం సెక్రటరీ గంగాధర్, బత్తుల రాము, యక్ష రమణమ్మ, నాగిరెడ్డి, శేఖర్, పోలవరపు రమణమ్మ పాల్గొన్నారు.

అక్షరాలు అంటేనే మోదీ ప్రభుత్వానికి భయం

- పుస్తకాలపై నిషేధం అనైతిక చర్య
- జేవీ సత్యనారాయణ మూర్తి ఆక్షేపణ



అల్లిపురం: అక్షరాలు, పుస్తకాలను చూసి మోదీ ప్రభుత్వం భయపడుతోందని వైవిజయ్ కుమార్ మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణ మూర్తి ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే 25 పుస్తకాలను కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నిషేధించాలని నిర్ణయం చేశారు. 370 ఆర్టికల్‌ను రద్దు చేసిన ఆగస్టు 5నే ఈ అనైతిక చర్యకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. మౌలానా మౌదూదీ రాసిన అల్ జిహాదుల్ ఫిల్ ఇస్లాం, ది స్టోరీ ఆఫ్ కశ్మీర్, సుమంత్ర బోస్ రాసిన కశ్మీర్ ఎట్ ది క్రాస్‌రోడ్స్, కంటెస్టెడ్ లాండ్స్, 'ద యూ రిమెంబర్ కునాన్ పోష్పోరా' పేరుతో రచయితలు ఎస్సార్ బతూల్, ఇఫ్రా బట్, మునజ రషీద్, నటాషా రాథర్, సమ్రీనా ముష్తాక్ రాసిన పుస్తకం, 'డు యూ రిమెంబర్ కునాన్ పోష్పోరా' అనురాధా భాసిన్ రాసిన 'ఎ డిస్మాంటిల్డ్ స్టేట్' వంటి పుస్తకాలతో పాటు అరుంధతి రాయ్, ఏజీ నూరాని వంటి ప్రగతిశీల రచయితల పుస్తకాలు ప్రజల మెదళ్లను కలిపిస్తున్నాయనే భయంతోనే ఈ చర్యకు పాల్పడినట్లు అభిప్రాయపడ్డారు. సంఘ్ పరివార్ ప్రోద్బలంతో రచయితల భావ ప్రకటన స్వేచ్ఛపై ఈ తరహా నిరంకుశ చర్యలను పుస్తక ప్రేమికులు, అభ్యుదయవాదులు, ప్రగతిశీల శక్తులు ఖండించాలని కోరారు. పుస్తకాలపై నిషేధం ఎత్తి వేసేలా కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పిలుపునిచ్చారు.

సాయిరాం పార్లర్‌లో రూ.2.80 లక్షల చోరీ

- గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులు

తాటిచెట్లపాలెం: డైమండ్ పార్క్ వద్ద సాయిరాం పార్లర్‌లో చోరీ జరిగింది. నిందితుడిని కేవలం గంటల వ్యవధిలోనే ఫోర్త్ టౌన్ పోలీసులు పట్టుకుని, చోరీ సొత్తు రికవరీ చేశారు. వివరాలిలా.. సాయిరాం పార్లర్‌లో పనిచేస్తున్న డి.కిరణ్ ఆదివారం రాత్రి వచ్చిన కలెక్షన్ సుమారు రూ.2.80 లక్షలను దొంగిలించి పారిపోయాడు. సోమవారం ఉదయం విధులకు వచ్చిన క్యాష్ సూపర్‌వైజర్ పోల రాము గురుదు తనిఖీ చేయగా.. అక్కడ లేదు. వెంటనే విషయాన్ని ఫోర్త్ టౌన్ పోలీసులకు తెలియజేశాడు. దీనిపై ఫిర్యాదు నమోదు చేసిన పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సీసీ టీవీ ఫుటేజీలను తనిఖీ చేశారు.. కిరణ్ సొమ్ము దొంగిలించినట్లు తెలిసింది. సాంకేతిక పరిజ్ఞానంతో అతడి కదలికలను గమనించిన పోలీసులు నిందితుడు తాడిచెట్లపాలెంలో ఉన్నట్లు గుర్తించి, అక్కడ అతడిని అదుపులోకి తీసుకుని, చోరీ సొత్తు రూ.2.80 లక్షలను రికవరీ చేశారు. ఈ కేసు దర్యాప్తులో ఫోర్త్ టౌన్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఐ మహమ్మద్ సల్మాన్ బేగ్, టూ టౌన్ ఎస్ఐ సుశీలల బృందంగా ఏర్పడి చాకచక్యంగా, అతివేగంగా చర్యలు తీసుకున్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు సోమవారం 19వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టల్ ద్వారా పంపే వారు పంపించిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. వివరాలకు 0891 2711725, 2566514లో సంప్రదించాలని సూచించారు. ఆలయ ఏఈఓ కె.రాజేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

- కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం ఆష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 (టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ – యూబీఐఎన్ 0806081)కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు.

మౌంట్ అబులో జాతీయ మీడియా సదస్సు



సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: అంతర్జాతీయ ముఖ్య కేంద్రం మౌంట్ అబు (రాజస్థాన్)లో సెప్టెంబర్ 26 నుంచి 30 వరకు జాతీయ మీడియా సదస్సు జరుగుతుందని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె సదస్సు వివరాలు తెలియజేస్తూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, యూట్యూబర్స్ ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. మాజీ భారత ఆటు రిజర్వ్ సెంటర్ డైరెక్టర్ టీసీ ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి నిజ జీవితంలో ఆధ్యాత్మిక శక్తి వెలుగులు నింపుతుందన్నారు. సమాజంలో శాంతి, పవిత్రత, సంతోషాన్ని నింపడంలో మీడియా పాత్ర కీలకమని, ఈ సదస్సులో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 25న ప్రకాష్ మణి దాది 19వ వర్ధంతిని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా లక్ష యూనిట్ల రక్తం సేకరించి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం ఈ నెల 22, 23, 24 తేదీల్లో గొప్ప మహా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 85558 57990, 91777 44966 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డెక్కిన ఆటో కార్మికులు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు, ఆటో కార్మికులు

'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం'తో రోడ్డున పడతామని ఆందోళన

మహారాణిపేట: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడం వల్ల తమ ఉపాధి కోల్పోయి రోడ్డున పడతామని విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ఆటో కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక, ఉన్నత చదువులు చదువుకున్న వారికి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించలేకపోవడంతో ఆటో మెటార్ రంగాన్ని ఎంచుకుని కుటుంబాలతో బతుకుతున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు రోడ్డున పడతారని, ఈ ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబు మాట్లాడుతూ ప్రైవేట్ ఫైనాన్స్ ద్వారా రూ.50 వేలు కట్టి ఆటోలు కొన్నామని, ఇప్పుడు ప్రయాణికులు ఎక్కకపోతే నెలసరి వాయిదాలు కట్టడం కష్టంగా మారుతుందన్నారు. సంఘ నాయకుడు షేక్ రెహ్మాన్ మాట్లాడుతూ మోటార్ కార్మికులకు జాతీయ బ్యాంకుల ద్వారా ద్వారా మహిళలకు ఇచ్చేలా పావలా వడ్డీకే వాహనాలకు రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వాహన మిత్ర పథకం వెంటనే అమలు చేయాలని, పీఎఫ్, ఇతర సదుపాయాలతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో–మోటార్ డ్రైవర్లకు సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదంలో చనిపోతే రూ.15 లక్షలు మంజూరు చేయాలని, ప్రైవేట్ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోలను రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.



నగరంలో ఆటో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు, డ్రైవర్లు

కార్యక్రమంలో సంఘ నాయకులు హేమంత్, కె.శివ, శివాజీ, శ్రీను, అవతారం, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఉపాధి సంగతేంటి?

బీచ్‌రోడ్డు: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్న కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఏం ఉపాధి చూపిస్తుందో చెప్పాలని ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ రైల్వే స్టేషన్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షల మంది ఆటో కార్మికులు 24 గంటల పాటు ఆర్టీసీతో సమానంగా ప్రజా రవాణాలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ గమ్యస్థానాలకు చేరవేస్తున్నారని చెప్పారు. అలాంటి ఆటో డ్రైవర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన వాహన మిత్ర పథకాన్ని కూడా అమలు చేయకుండా.. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటన చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తక్షణమే ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కె.గణేష్, కోశాధికారి కె.రాము, ఆజీస్ బ్యాలెన్స్ ఎండీ అలీ, పెంకి సత్తిబాబు, ఎస్. ప్రసాద్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సమయపాలన, నిబద్ధత ముఖ్యం



మాట్లాడుతున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి. చిత్రంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణి

మహారాణిపేట: కేజీహెచ్‌లో పనిచేస్తున్న వైద్యులంతా ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రిలోనే ఉండాలని ఆంధ్రా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి అన్నారు. ఏఎంసీ, కేజీహెచ్‌లకు చెందిన అన్ని స్థాయి వైద్యుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సంధ్యాదేవి మాట్లాడుతూ డ్యూటీ సమయాల్లో ఆస్పత్రి పనుల్లో పూర్తిగా నిమగ్నం కావాలని స్పష్టం చేశారు. రోగి సేవలతో పాటు బోధన, పరిశోధన కార్యకలాపాలకు అందుబాటులో ఉండటం ముఖ్యమన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలని సూచించారు. పలు శాఖల వైద్యుల సమన్వయంతో పనిచేయాలని ప్రకటించారు. ఇటువంటి సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రతి రోజు విధుల్లో కూడా ఉండాలన్నారు. స్వయం క్రమశిక్షణ, సమయపాలన, నాణ్యమైన వైద్య సేవల ద్వారా ఆస్పత్రి ప్రతిష్ట పెంచాలని తెలిపారు. ఆస్పత్రి నిర్వాహకులు పారదర్శకత, బాధ్యత, సేవల్లో ఉన్నత ప్రమాణాలు కొనసాగించడానికి కట్టుబడి ఉన్నారన్నారు. ఏఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ప్రొఫెసర్లు, విభాగాధిపతులు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

బాధితులకు మంచి వైద్య సేవలు

డాక్టర్ వాణి మాట్లాడుతూ ఆగస్టు 7న విశాఖ నగర పరిసర ప్రాంతంలో జరిగిన పేలుడు ప్రమాదంలో బాధితులకు కేజీహెచ్‌లో మంచి సేవలందించారని,

సమస్యలు పరిష్కరించాలని గిగ్ వర్కర్ల ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న స్విగ్గీ కార్మికులు

మహారాణిపేట: స్విగ్గీ, జొమాటో ఫుడ్ డెలివరీ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లాలో ఏజెన్సీగా స్విగ్గీ, జొమాటోల్లో పనిచేస్తున్న సుమారు 40 వేల మంది గిగ్ వర్కర్లు రోజూ సమాజానికి సేవలందిస్తున్నా, వారికి ఎలాంటి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యను పూర్తి చేసినప్పటికీ ఉపాధి అవకాశాలు లేక గిగ్ వర్క్ వైపు మొగ్గు చూపాల్సి వచ్చిందని, వారికి మెరుగైన సమస్యలు వస్తే పరిష్కరించే నాథుడే లేడని ఆల్ ఇండియా గిగ్ వర్కర్ యూనియన్ అధ్యక్షుడు బి.జగన్ వాపోయారు. మొత్తం 12 అంశాలపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రోజురోజుకూ పెరిగిపోతున్న జీవన ఖర్చులు, పెట్రోల్ ధరలు, అనిశ్చితమైన ఆదాయం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

ఇద్దరు యువకులకు ఆశ్రయం



ఏయూటీడీ షెల్టర్‌లో ఆశ్రయం పొందిన యువకులతో సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు

అల్లిపురం: మానసిక వ్యాధి నుంచి కోలుకున్న ఇద్దరు యువకులకు జీవీఎంసీ ఏయూటీడీ బీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. గవర్నమెంట్ మెంటల్ కేర్ హాస్పిటల్ వైద్యులు ఇచ్చిన సమాచారం ప్రకారం ఏయూటీడీ సిబ్బంది వెళ్లి బెంగళూరుకు చెందిన పరమేశ్వర్ (35), రూర్కెలకు చెందిన రాహుల్ ప్రధాన్ (29)ను తీసుకొచ్చారని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. వీరిని కుటుంబ సభ్యులకు అప్పగించే వరకు ప్రస్తుతం షెల్టర్‌లో వసతి కల్పించామని తెలిపారు.